క్లుప్తంగా

నారాయణుడికి వెండి ఊయల వితరణ



చైర్మన్ శ్రీనివాసరెడ్డికి వెండి ఊయలను అందిస్తున్న శివుడు

పెద్దపప్పూరు: అశ్వత్థ నారాయణస్వామికి ఆశ్వయుజ మాసం రెండో ఆదివారం సందర్భంగా వైఎస్సార్ కడప జిల్లా దొమ్మనంద్యాల గ్రామానికి చెందిన కుమ్మర శివుడు అనే భక్తుడు వెండి ఊయలను వితరణ చేశారు. దాత తన మొక్కబడిలో భాగంగా రూ.67,152 విలువైన వెండి ఊయలను ఆలయ చైర్మన్ చిక్కేపల్లి శ్రీనివాసరెడ్డికి అందజేశారు. కార్తీక, మాఘమాసాల్లో భక్తుల సందర్శనార్థం అందుబాటులో ప్రత్యేకంగా ఏర్పాటు చేస్తామని చైర్మన్ తెలిపారు. భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో తీర్థప్రసాదాలతోపాటు అన్నదానం ఏర్పాటుచేశారు.

డాక్టరేట్ పొందిన రషీదాకు సన్మానం



రషీదా దంపతులను సన్మానిస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

తాడిపత్రి అర్బన్: గోల్డ్ ఎక్స్చేంజ్ ట్రేడ్ ఫండ్ అనే అంశంపై పరిశోధన చేసినందుకు గాను డాక్టరేట్ పొందిన ఇన్నర్‌వీల్ క్లబ్ సభ్యురాలు రషీదా బేగంను రోటరీ క్లబ్ సభ్యులు ఘనంగా సన్మానించారు. ఆదివారం స్థానిక రోటరీ క్లబ్ కార్యాలయంలో కార్యక్రమం జరిగింది. ఈసందర్భంగా రోటరీ క్లబ్ అధ్యక్షుడు రమేష్‌బాబు మాట్లాడుతూ ఇన్నర్‌వీల్ సభ్యురాలైన రషీదా బేగం ఎస్కే యూనివర్సిటీలో డాక్టరేట్ పొందడం అభినందనీయమన్నారు. అనంతరం రషీదాబేగం దంపతులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ సెక్రటరీ సుబ్రమణ్యం, సభ్యులు బాల సుబ్రమణ్యం, మద్దిలేటి, నాగేంద్ర, బాబు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు నిత్యావసరాల పంపిణీ



పేదలకు నిత్యావసరాలను అందిస్తున్న సభ్యులు

తాడిపత్రి అర్బన్: ఉద్యోగ, ఉపాధ్యాయ సామాజిక సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం పేదలకు నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. స్థానిక వివేకానంద పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో దసరా పండుగను పురస్కరించుకుని 25 మంది పేదలకు 18 రకాల నిత్యావసరాల కిట్లను అందజేశారు. ఈసందర్భంగా పేదలు ఉద్యోగ, ఉపాధ్యాయ సామాజిక సేవా సంస్థ సభ్యులకు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో అధ్యక్షుడు శ్రీహరి, ప్రధాన కార్యదర్శి శంకర్, కన్వీనర్ శ్రీరంగయ్య, ఉపాధ్యక్షుడు రామాంజినేయులు, సభ్యులు బిసి ఓబులేసు, వద్ది చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఎద్లబండిని ఢీకొన్న లారీ.. ముగ్గురికి గాయాలు

గుత్తి రూరల్: మండలంలోని బసినేపల్లి గ్రామ శివారులో ఎద్దులబండిని లారీ ఢీకొన్న ప్రమాదంలో ముగ్గురు గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాలు.. బసినేపల్లికి చెందిన కృష్ణమూర్తి, సూర్యప్రకాష్, సరస్వతి ఆదివారం ఎద్దుల బండిలో పొలంకు బయలుదేరారు. అయితే పత్తికొండ వైపు నుంచి వేగంగా వచ్చిన లారీ వెనుక నుంచి ఎద్దుల బండిని ఢీకొంది. ప్రమాదంలో బండిపై నుంచి కింద పడి రైతు కృష్ణమూర్తి, సూర్యప్రకాష్, సరస్వతికి గాయాలయ్యాయి. గాయపడిన ముగ్గురినీ స్థానికులు గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం వైద్యుల సూచన మేరకు కృష్ణమూర్తిని అనంతపురం తీసుకెళ్లారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జయ జయహే మహిషాసుర మర్దిని



గుంతకల్లులో మహిషాసుర మర్దిని అలంకరణలో వాసవీమాత



గార్లదిన్నె మండలం కల్లూరులో దుర్గాదేవిగా వాసవీమాత



పెద్దపప్పూరులో ధనలక్ష్మీ అలంకరణలో చౌడేశ్వరీదేవి



తాడిపత్రిలో మహిషాసురమర్దిని రూపంలో చౌడేశ్వరీదేవి

సాక్షి నెట్‌వర్క్: దసరా శరన్నవ రాత్రి ఉత్సవాలు తాడిపత్రి, గుంతకల్లు, శింగనమల నియోజకవర్గాల్లో వైభవంగా జరుగుతున్నాయి. ఆదివారం ఎనిమిదో రోజు అమ్మవారి ఆలయాల్లో పూజలు ఘనంగా నిర్వహించారు. అర్చకులు అమ్మవార్లను ప్రత్యేక రూపాల్లో కొలువుదీర్చగా భక్తులు పెద్ద సంఖ్యలో దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.



పామిడిలో మహిషాసుర మర్దినిగా దర్శనమిస్తున్న కన్యకా పరమేశ్వరీమాత



తాడిపత్రిలో దుర్గాదేవి రూపంలో అంకాలమ్మ తల్లి



గుంతకల్లులో దుర్గాదేవిగా కొల్హాపురి మహాలక్ష్మి



పెద్దవడుగూరులో ప్రత్యేక అలంకరణలో సుంకులమ్మ



గుత్తిలో మహిషాసుర మర్దిని రూపంలో వాసవీమాత



గుత్తి మండలం సేవాఘడ్‌లో దుర్గాదేవిగా జగదాంబ



శింగనమలలో మహిషాసుర మర్దిని రూపంలో వాసవీమాత



తాడిపత్రిలో మహిషాసుర మర్దినిగా వాసవీమాత

శేషవాహనంపై చింతలరాయుడి విహారం

తాడిపత్రి అర్బన్: చింతల వెంకటరమణస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మొదటిరోజైన ఆదివారం చింతల వెంకటరమణస్వామి శేష వాహనంపై విహరించారు. ఉదయం ఆలయంలో ధ్వజారోహనం కార్యక్రమాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. చింతలరాయుడిని పల్లకీలో ఉంచి ఆలయ మాడ వీధుల్లో ఊరేగించారు. సాయంత్రం చింతల వెంకటరమణస్వామి శేషవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ప్రత్యేకంగా అలంకరించిన చింతల రాయుడికి వేదపండితులు మంత్రోచ్చారణల మధ్య మేళతాళాలతో పురవీధుల్లో ఊరేగించారు. భక్తులు స్వామికి అడుగడుగునా నైవేద్యాలు సమర్పించి తమ భక్తిని చాటుకున్నారు. ఆలయ ఈఓ సుబ్రమణ్యం, ధర్మకర్తల మండలి అధ్యక్షుడు మురళీప్రసాద్‌రెడ్డి పర్యవేక్షణలో ఉత్సవాలు సాగాయి.



ప్రత్యేక అలంకరణలో శ్రీదేవి, భూదేవి సమేత చింతలరాయుడు



శేషవాహనంపై ఊరేగుతున్న చింతల వెంకటరమణస్వామి

సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు

గార్లదిన్నె: మండలంలోని కోటంక కొండల్లో వెలసిన సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం ప్రధాన అర్చకుడు రామాచార్యులు స్వామిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకం, కుంకుమార్చన, ఆకుపూజ వంటి ప్రత్యేక పూజలు చేశారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామి, 108 శివలింగాలను దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు.



అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి

అశ్వ వాహనంపై శ్రీవారు

అనంతపురం కల్చరల్: శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా అశ్వవాహనంపై శ్రీవారు విహరించారు. ఆదివారం స్థానిక ఆర్‌ఎఫ్‌రోడ్డులోని లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీవారు శ్రీదేవి, భూదేవి సమేతుడై అశ్వ వాహనంపై ఆలయ పరిసరాల్లో విహరించారు. ఉదయం లక్ష్మీ నారాయణ హోమం, దీక్షా హోమం వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ శాస్త్రోక్తంగా సాగాయి. తీర్థప్రసాద వినియోగం చేశారు. అనంతరం ప్రధాన అర్చకులు, కమిటీ సభ్యులు మాట్లాడుతూ బ్రహ్మోత్సవాల ముగింపు సందర్భంగా సోమవారం రథోత్సవం జరుగుతుందన్నారు. మంగళవారం చక్ర స్నానం, ధ్వజారోహనంతో ఉత్సవాలు ముగుస్తాయని తెలిపారు.

జలపాతాల్లో జన సందడి



ఆలూరికోన జలపాతం వద్ద కేరింతలు కొడుతున్న పిల్లలు, పెద్దలు

తాడిపత్రిటౌన్: దసరా సెలవులు కావడంతో జలపాతాల వద్ద జన సందడి నెలకొంది. తాడిపత్రి మండలం ఆలూరికోన, యాడికి మండలం కోన ఉప్పలపాడు వద్ద ఉన్న జలపాతం, అల్ట్రాటెక్ సిమెంట్ ఫ్యాక్టరీ సమీపంలో వున్న లక్కిగుండం జలపాతం వద్ద నిత్యం జన రద్దీ ఉంటోంది. ప్రకృతి రమణీయత, పక్షుల కిలకిలరావాలతో పాటు జలపాతల సవ్వడితో పిల్లాపెద్దలు సేద తీరుతున్నారు. తాడిపత్రి, పరిసర గ్రామాల ప్రజలు ప్రతినిత్యం ఎంతో మంది కుటుంబ సమేతంగా వెళ్లి సంతోషంగా గడుపుతున్నారు. అలాగే ఆయా జలపాతల వద్ద ఉన్న శివపార్వతుల ఆలయాలు, ఆలూరికోన రంగనాథస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహిస్తూ ఇటు ఆహ్లాదంతో పాటు ఆధ్యాత్మిక అనుభూతి పొందుతున్నారు.



కోనుప్పలపాడు వద్ద జలపాతంలో జనాల సందడి

ఎమ్మెల్యే చొరవతో రోడ్డు నిర్మాణం

బుక్కరాయసముద్రం: ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి ప్రత్యేక చొరవతో మండల కేంద్రంలోని చెరువు కట్టపై రోడ్డు నిర్మాణానికి అధికారులు చర్యలు చేపట్టారు. మండల కేంద్రంలోని బీకేఎస్ చెరువు కట్టపై ఉన్న రోడ్డును ప్రభుత్వ విద్య సలహాదారు ఆలూరి సాంబశివారెడ్డి ఆదివారం పరిశీలించారు. బీకేఎస్ పరిధిలోని చెరువు కట్టపైన గోశాల కలెక్టరేట్‌కు వెళ్లే రోడ్డు మార్గం గుంతలు ఉన్నాయని ఇది వరకే ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి జిల్లా ఉన్నతాధికారులకు తెలియజేశారన్నారు. ఈ నేపథ్యంలో అధికారులు రూ.40 లక్షల వ్యయంతో తారురోడ్డు నిర్మిస్తున్నారని తెలిపారు. బీకేఎస్ నుంచి కలెక్టరేట్‌కు వెళ్లే రహదారి నిత్యం ఎంతో రద్దీగా ఉంటుందన్నారు. ఈ రోడ్డు నిర్మాణంతో చెరువు కట్టపై నుంచి మండల ప్రజలు సులభంగా జిల్లా కేంద్రానికి చేరుకునేలా వీలు కలుగుతుందన్నారు. పనులు నాణ్యతగా చేపట్టాలని ఆయన అధికారులకు సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఆలూరి రమణారెడ్డి, అధికారులు పాల్గొన్నారు.



రోడ్డు నిర్మాణంపై వివరాలు తెలుసుకుంటున్న ఆలూరు సాంబశివారెడ్డి

మున్సిపల్ కార్యాలయంలో ఆయుధ పూజ



పంప్‌హౌస్‌లో ఆయుధపూజ చేస్తున్న చైర్‌పర్సన్ భవానీ తదితరులు



వాహన పూజ చేస్తున్న చైర్‌పర్సన్ వన్నూర్‌బీ

గుంతకల్లుటౌన్: దేవీ శరన్నవరాత్రి వేడుకల్లో భాగంగా ఆదివారం మున్సిపల్ ఇంజినీరింగ్, ఎలక్ట్రికల్ విభాగాల ఆధ్వర్యంలో ఆయుధపూజ ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్.భవాని, కమిషనర్ మల్లికార్జున విధి నిర్వహణలో ప్రాముఖ్యతనిచ్చే సాధనాలు, ఆయుధాలకు పూజలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా జరుపుకునే విజయదశమిని అందరూ సుఖసంతోషాలతో జరుపుకోవాలన్నారు. అనంతరం సమ్మర్‌స్టోరేజీ ట్యాంక్ పంప్‌హౌస్‌ల్లోనూ ఆయుధపూజ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ రామలింగప్ప, ఎంఈఈ గురప్ప యాదవ్, డీఈలు హేమచంద్ర, రామ్మూర్తి, ఏఈలు హరికృష్ణ, ఎల్ఎస్. మహబూబ్‌బాషా, కౌన్సిలర్లు నాగరత్న, మెహరున్నీసా, రంగమ్మ, సుధాకర్, భాస్కర్, కృపాకర్, పవన్‌గౌడ్, కోఆప్షన్‌సభ్యులు ఫ్లయింగ్‌మాబు, నూర్‌నిజామి పాల్గొన్నారు.

గుత్తి: గుత్తి, గుత్తి ఆర్‌ఎస్‌లో ఆదివారం దుర్గాష్టమి వేడుకలను ప్రజలు ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ వన్నూర్‌బీ, కమిషనర్ శ్రీనివాసులు ఆయుధ పూజ నిర్వహించారు. గుత్తి రైల్వే డీజిల్‌షెడ్‌లో సీనియర్ డీఎంఈ రమేష్ ఆధ్వర్యంలో దుర్గాష్టమి వేడుకలు నిర్వహించారు.

గార్లదిన్నె: మండల వ్యాప్తంగా ఆదివారం దుర్గాష్టమి సందర్భంగా ప్రజలు ఆయుధాల పూజ నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయాల్లో స్వాములకు ప్రత్యేక పూజలు చేశారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో పోలీసులు ఆయుధ పూజ చేశారు.

కేసు నమోదు

యాడికి: ప్రభుత్వానికి వ్యతిరేకంగా సోషల్‌మీడియాలో పోస్టులు పెడుతున్న వ్యక్తిపై కేసు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి తెలిపారు. మండలంలోని టి. కొత్తపల్లె గ్రామానికి చెందిన నరేంద్రనాయుడు కొంతకాలంగా సోషల్ మీడియాలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా, మహిళలను కించపరిచేలా పోస్టులు పెడుతున్నట్లు వైస్ ఎంపీపీ చెన్నప్ప శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో నరేంద్రనాయుడుపై ఆదివారం కేసు నమోద చేశామని ఎస్ఐ పేర్కొన్నారు.

సంతల ఆదాయం రూ.4.34 లక్షలు

అనంతపురం అగ్రికల్చర్: స్థానిక వ్యవసాయ మార్కెట్‌యార్డు ప్రాంగణంలో ఈ వారం జరిగిన పశువులు, జీవాల సంతల ద్వారా రికార్డు స్థాయిలో రూ.4.34 లక్షలకు పైగా ఆదాయం వచ్చినట్లు యార్డు చైర్మన్ ఏకేఎస్ ఫయాజ్, సెక్రటరీ ఆర్.జయలక్ష్మి తెలిపారు. శనివారం జరిగిన గొర్రెలు, మేకల సంత నుంచి రూ.2,50,070 వసూలయ్యిందన్నారు. ఆదివారం జరిగిన పశువుల సంత ద్వారా రూ.1,84,400 వసూలైనట్లు తెలిపారు.

సుబ్బరాయసాగర్‌లో 7.2 మీటర్లకు చేరిన నీటి మట్టం

పుట్లూరు: తాగునీటి అవసరాల కోసం సుబ్బరాయసాగర్‌కు హెచ్చెల్సీ నీరు చేరుతోంది. ఇప్పటివరకు సాగర్‌కు 7.2 మీటర్ల నీటి మట్టం చేరినట్లు హెచ్చెల్సీ జేఈ ఫణీంద్ర తెలిపారు. సుబ్బరాయసాగర్‌కు సరఫరా అయ్యే నీరు 55 క్యూసెక్కులుగా ఉందన్నారు. తాగునీటి అవసరాల కోసం చెరువులకు నీటిని సరఫరా చేయనున్నట్లు వివరించారు.

బార్బర్ షాప్‌పై తాగుబోతు దాడి

గుత్తి: పట్టణంలోని కోట వీధిలో సంజీవ్ అనే వ్యక్తికి చెందిన బార్బర్ షాప్‌పై ఆదివారం ఓ తాగుబోతు దాడి చేశాడు. బాధితుడి వివరాల మేరకు.. పట్టణానికి చెందిన శంకర్ అనే వ్యక్తి ఉదయం పూటుగా మద్యం సేవించి బార్బర్ షాపు వద్దకు వచ్చాడు. తాళాలు పగులగొట్టి షాపులో ప్రవేశించి అందులో ఉన్న వస్తువులను ధ్వంసం చేశాడు. ఘటనలో సుమారు రూ.30 వేల విలువైన సామగ్రి ధ్వంసమైంది. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. బార్బర్ షాప్‌పై దాడి చేసిన శంకర్‌పై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు నష్ట పరిహారం ఇప్పించాలని నాయీ బ్రాహ్మణ సంఘం నాయకులు డిమాండ్ చేశారు.



తాగుబోతు దాడిలో ధ్వంసమైన అద్దం

దసరా శుభాకాంక్షలు



గుంతకల్లుటౌన్: గుంతకల్లు నియోజకవర్గ ప్రజలకు ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి దసరా శుభాకాంక్షలు తెలియజేశారు. చెడుపై మంచి సాధించిన విజయానికి గుర్తుగా విజయదశమిని జరుపుకుంటామని ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ దసరా పర్వదినాన నియోజకవర్గ ప్రజలు, ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులకు శాంతి, ఆరోగ్య, సౌభాగ్యాలు ప్రసాదించాలని దుర్గాదేవిని ప్రార్థిస్తున్నట్లు ఎమ్మెల్యే తెలియజేశారు.

తాడిపత్రి అర్బన్: తాడిపత్రి శాసనసభ్యులు కేతిరెడ్డి పెద్దారెడ్డి నియోజకవర్గ ప్రజలకు విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు. దసరా పండుగను ఇంటిల్లిపాది సుఖ, సంతోషాలతో జరుపుకోవాలని ఆకాంక్షించారు. చెడు మీద మంచి సాధించిన విజయానికి ప్రతీకగా జరుపుకునే విజయదశమి పండుగ ప్రజలందరి జీవితాల్లో కొత్త వెలుగులు తీసుకురావాలని ఆయన కోరుకున్నారు.

శింగనమల: చెడుపై మంచికి గుర్తుగా చేసుకునే విజయదశమి నియోజకవర్గ ప్రజలందరికీ శుభాలు కలగజేయాలని ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి ఆకాంక్షించారు. ఆదివారం ఎమ్మెల్యే నియోజకవర్గ ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రజలందరూ దుర్గాదేవి ఆశీస్సులతో సుఖసంతోషాలు, ఐశ్వర్యాలతో తులతూగాలని కోరారు.

చైతన్యకాలనీలో తీరిన తాగునీటి సమస్య



చైతన్యకాలనీలో విద్యుత్ మోటారును మరమ్మతు చేస్తున్న దృశ్యం

పామిడి: పట్టణంలోని చైతన్యకాలనీలో తాగునీటి సమస్య తీరింది. కాలనీలోని ఆంజనేయస్వామి ఆలయం వద్ద విద్యుత్ బోర్ మోటారు ఇటీవల పని చేయకపోవడంతో తాగునీటి సమస్య ఉత్పన్నమైంది. కాలనీవాసులు సమస్యను ఈఓ చంద్రశేఖర్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఈఓ ఆదివారం సిబ్బందితో కలిసి మోటార్‌ను మరమ్మతు చేయించారు. తాగునీరు సరఫరా కావడంతో కాలనీవాసులు హర్షం వ్యక్తం చేశారు.

చిన్నారిపై కుక్క దాడి

గుత్తి: పట్టణంలోని బెస్త కాలనీలో ఆదివారం ఓ బాలుడిపై కుక్క దాడి చేసింది. వివరాలు.. కాలనీలో చిన్నారి నవదీప్ ఇంటి ముందు ఆడుకుంటుండగా ఓ కుక్క వచ్చి దాడి చేసింది. కుక్క దాడిలో తీవ్రంగా గాయపడిన నవదీప్‌ను తల్లి పుష్ప స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించింది. కుక్కల బెడద అధికమైందని నవదీప్ తల్లి పుష్ప ఆవేదన వ్యక్తం చేసింది.



గాయపడిన బాలుడు నవదీప్